టీపీటీఎఫ్ ఉపాధ్యక్షుడిగా లక్ష్మయ్యయాదవ్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టీపీటీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మర్పల్లి లక్ష్మయ్య యాదవ్ ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన టీపీటీఎఫ్ రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశంలో ఈ మేరకు లక్ష్మయ్యయాదవ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు జిల్లా అధ్యక్షుడిగా చేసిన అనుభవం ఉంది. ఈ సందర్భంగా లక్ష్మయ్యయాదవ్ తన ఎన్నికకు సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సోమశేఖర్, అనుముల రాంచందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అంత్యక్రియలకు తక్షణసాయం అందజేత

బొల్లారం, నవంబర్ 27: బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీలో నివసించే కోలకతాకు చెందిన మల్లేశ్(90) అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం మృతి చెందాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న మున్సిపల్ యువజన నాయకుడు ప్రవీణ్ రెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి వీవీఆర్ ఫౌండేషన్ తరపున కుటుంబానికి తక్షణసాయంగా రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో స్థానికులు నర్సింహులు, నాగేశ్వర్ రెడ్డి, దుర్యోదన, గోపి, కృష్ణారావు, తేజ, శ్రీకాంత్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

వరుణ్‌కుమార్ రాథోడ్

రామచంద్రాపురం, నవంబర్ 27: జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో తొమ్మిదో తరగతి విద్యార్థి వరుణ్‌కుమార్ రాథోడ్ పాలుపంచుకోనున్నాడు. నేషనల్ గేమ్స్ కబడ్డీ పోటీలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అండర్ 14 విభాగంలో తెలుగు రాష్ట్రాల నుంచి విద్యార్థి వరుణ్‌కుమార్ రాథోడ్ ఎంపికయ్యాడు. మహారాష్ట్రలో వచ్చేనెలా 9, 10, 11, 12 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి కబడ్డీలో వరుణ్‌కుమార్ తన ప్రతిభను చాటనున్నాడు. ఈ సందర్భంగా వరుణ్‌కుమార్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఖేతావత్ తౌర్య నాయక్ మాట్లాడుతూ తన కుమారుడు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం సంతోషంగా ఉందని తెలిపారు.

రికార్డులు సక్రమంగా నమోదు చేయాలి

కోహీర్, నవంబర్ 27: అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన రికార్డులను సక్రమంగా నమోదు చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గ్రేసీ సూచించారు. బుధవారం మండలంలోని కవేలి అంగన్‌వాడీ కేంద్రంలో పలు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. చిన్నారులు, మహిళలకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి

జిన్నారం, నవంబర్ 27: కొడకంచి గ్రామంలో యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. కుటుంబీకులు, స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. కొడకంచి పంచాయతీలోని పుట్టగూడ కు చెందిన కంచనపల్లి మహేశ్(26) మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు ఆందోళన చెందారు. బుధవారం ఉదయం గ్రామంలోని ఓ దుకాణం సమీపంలో మృతి చెంది రోడ్డు పక్కన పడి ఉన్నాడు. స్థానికులు కుటుంబీకులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ నయీమొద్దీన్, ఎస్ఐ నాగలక్ష్మి, పోలీసు సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జేఎన్‌టీయూలో విద్యార్థుల రక్తదానం

చౌటకూర్, నవంబర్ 27: మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో బుధవారం సంగారెడ్డి ప్రభుత్వ దవాఖాన, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 107మంది విద్యార్థులు రక్తదానం చేశారు. ప్రిన్సిపాల్ ఆచార్య నర్సింహా రక్తదానం చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్ రావు, ఈసీఈ విభాగాధిపతి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ ఆచార్య రజనీశ్, డాక్టర్ వెంకట్రామిరెడ్డి, టెక్నికల్ సపోర్ట్ రాజు, పీఆర్ఓ విజయ్ పాల్గొన్నారు.

ముగిసిన ట్రైనీ అధికారుల పర్యటన

గురుకుల పాఠశాల విద్యార్థులతో క్రికెట్ ఆడిన కేంద్ర సర్వీసుల ట్రైనీ అధికారులు

జిన్నారం, నవంబర్ 27: నాలుగు రోజులుగా కొడకంచి, జిన్నారం గ్రామాల్లో పర్యటించిన ట్రైనీ అధికారులు చివరి రోజు బుధవారం జిన్నారం శివారులోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడి సందడి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయ, అధ్యాపక సిబ్బందితో గ్రౌండ్‌లోనే సరదాగా గడిపారు. విద్యార్థులతో ఉత్సాహంగా క్రికెట్ ఆడారు. అధికారుల నాలుగు రోజుల పర్యటన ముగియడంతో కొడకంచిలో పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వర్ సాయంత్రం గ్రామస్తులతో కలిసి ఘనంగా వీడ్కోలు పలికారు. శాలువాతో అధికారులను సన్మానించారు.

అసైన్డ్ భూములను కాపాడాలని వినతి



తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం ఇస్తున్న రాళ్లకత్వ గ్రామ దళితులు

జిన్నారం, నవంబర్ 27: రాళ్లకత్వ శివారులోని సర్వేనంబర్ 286లోని తమ అసైన్డ్ భూములను కాపాడాలని దళితులు తహసీల్దార్‌ను కోరారు. ఈమేరకు బుధవారం గ్రామస్తులు, యువజన నాయకులతో కలిసి దళితులు తహసీల్దార్ భిక్షపతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 286 అసైన్డ్ భూముల్లో కంకర క్రషర్, క్వారీ ఏర్పాటు పనులు జరుగుతుండడంతో గ్రామస్తులు అధికారులను, న్యాయ స్థానాలను ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. కొంత మంది మహి కన్‌స్ట్రక్షన్ పేరుతో సంబంధిత శాఖల నుంచి ఎలాంటి ఎన్‌వోసీలు తీసుకోకుండానే క్వారీ, క్రషర్లకు సంబంధించి పనులు అక్రమంగా కొనసాగిస్తున్నారని, తమను భయపెడుతూ మా భూముల్లో నుంచి మట్టిని అక్రమంగా తవ్వుతున్నారని దళితులు తహసీల్దార్‌కు రాతపూర్వకంగా తెలిపారు. ఈ విషయంపై జిన్నారం సీఐ, ఎస్ఐలకు దళితులు వినతిపత్రాలను అందజేశారు. దళితుల భూముల జోలికి వస్తే పెద్దఎత్తున ఆందోళన చేస్తామన్నారు. సత్వరమే దీనిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్, సీఐ, ఎస్ఐలను కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏర్పుల శ్రీనివాస్, ఎస్సీ ఆర్పీఎస్ తాలూకా కన్వీనర్ మహేశ్, రాళ్లకత్వ దళితులు, తదితరులున్నారు.

పోలీసుల అదుపులో తప్పిపోయిన బాలుడు

బొల్లారం, నవంబర్ 27: బొల్లారం పారిశ్రామికవాడలో తప్పిపోయిన బాలుడిని గమనించిన స్థానికులు పోలీసులకు అప్పగించారు. బాలుడిని విచారించిన పోలీసులకు తన పేరు రిషబ్(3) అని తెలిపాడు. బాబు పారిశ్రామికవాడలోని రాణి డై కాస్ట్ దగ్గర ఏడ్చుకుంటూ కూర్చున్నాడని స్థానికులు పోలీసులకు తెలిపారు. వెంటనే బాలుడిని క్షేమం గా పోలీసులకు అప్పగించారు. పోలీస్ స్టేషన్లో ఉన్న బాలుడిని తల్లిదండ్రులు, బంధువులు ఎవరైనా గుర్తిస్తే వచ్చి తీసుకెళ్లాలని సీఐ రవీందర్ రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో నిందితుడికి ఐదేండ్ల జైలు

రామచంద్రాపురం, నవంబర్ 27: పోక్సో కేసులో నిందితుడికి బుధవారం జైలు శిక్ష పడింది. వివరాల్లోకి వెళ్తే.. ఆర్సీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బండ్లగూడలో 2023లో ఆచారిరాజు బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఘటనలో పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో జిల్లా మొదటి అడిషనల్ కోర్టు జడ్జి జయంతి కేసులో వాదోపవాదాలు విని సాక్ష్యాలను పరిశీలించి నిందితుడు ఆచారిరాజుకి ఐదేండ్ల జైలు, రూ.2వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. ఈ కేసుని పోక్సో కోర్టు పీపీ బగిలి సూర్‌రెడ్డి వాదించగా, కేసుకు సంబంధించిన పూర్తి సాక్ష్యాలను ఇన్‌స్పెక్టర్ జగన్నాథ్ కోర్టుకి సమర్పించారు.

ప్రజారోగ్యంపై కరదీపిక ఆవిష్కరణ

కర దీపికను విడుదల చేస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి, డీఎంహెచ్‌వో తదితరులు

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: ప్రజారోగ్యం కుటుంబ సంక్షేమానికి సంబంధించిన కర దీపికను బుధవారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్ విడుదల చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ గాయత్రీదేవితో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి కర దీపికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు కర దీపికను అందజేస్తామన్నారు. ప్రజారోగ్య కుటుంబ సంక్షేమానికి సంబంధించిన జాతీయ ఆరోగ్య మిషన్, జననీ సురక్షా యోజన, పాఠశాల విద్యార్థుల ఆరోగ్య సేవలు, ఆహారం, ఆరోగ్యం, హెచ్ ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిరోధక కార్యక్రమాలు, ఊపిరితిత్తుల వ్యాధులు, చిన్న పిల్లల వ్యాధులు, పరిసరాల పరిశుభ్రత, కీటక వ్యాధులు, రేబీస్, క్యాన్సర్, దంత వ్యాధుల తోపాటు ప్రాథమిక చికిత్స తదితర వివరాలు కర దీపికలో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రీ దేవి, డీఐవో డాక్టర్ శశాంక్, డెమో ప్రసాద్, రవి, శశి, సిబ్బంది పాల్గొన్నారు.

శైలజ కుటుంబాన్ని ఆదుకోవాలి

మాట్లాడుతున్న గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు జైపాల్ నాయక్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: గిరిజన విద్యార్థి శైలజ కుటుంబాన్ని ఆదుకోవాలని గిరిజన సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసిఫాబాద్ కొమురం భీం జిల్లా వాంకిడి మండలంలో గిరిజన ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని శైలజ కలుషిత ఆహారం తిని మృతి చెందడం బాధాకరమన్నారు. శైలజ కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతోపాటు కుటుంబంలో ఒకరికీ ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. శైలజ మృతిపై వెంటనే న్యాయ విచారణ జరిపించాలన్నారు. ఇప్పటి నుంచైనా అన్ని వసతి గృహాలు, పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందించాలన్నారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో విద్యార్థి సంఘం నాయకులు రాజేందర్‌నాయక్, దినేశ్‌నాయక్, సత్యమూర్తి, శ్రీకాంత్ నాయక్, వసంత్ నాయక్, కిశోర్, ఆకేశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు కక్ష సాధించడం తగునా?

తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

రాయికోడ్, నవంబర్ 27: రెవెన్యూ అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవరిస్తూ కొందరిపై కక్షసాధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని బాధితులు తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. రాయికోడ్ శివారలోని సర్వే నంబర్ 285లో పలువురు అక్రమంగా నిర్మాణాలు వేసుకున్నప్పటికీ, వారిని వదిలేసి కేవలం కొందరివి మాత్రమే తొలిగించడం సమంజసం కాదన్నారు. ఇదే సర్వే నంబర్ రాయికోడ్ కూడలిలో అక్రమంగా నిర్మించుకున్న భవనాలు, వ్యాపార సముదాయాలను తొలిగించాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. సర్వే నంబర్ 285లో అక్రమంగా నిర్మాణాలు చేపడితే చర్యలు తీసుకుంటామని, ఈ సర్వే నంబర్‌పై పూర్తిస్థాయిలో సర్వే చేస్తామని భరోసా ఇచ్చి నట్లు బాధితులు తెలిపారు.

డిస్టిలరీ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

చౌటకూర్, నవంబర్ 27: చౌటకూర్ సమీపంలోని ఈఎంపీఈఈ డిస్టిలరీ పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బుధవారం డీఏవైఎఫ్ఐ జిల్లా నాయకులు అనిల్, గోవర్ధన్ కాలుష్య నియంత్రణ మండలి అధికారి గీత సఫారికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిశ్రమ వల్ల వస్తున్న కాలుష్యంతో చౌటకూర్, సరాఫ్‌పల్లి, సుల్తాన్‌పూర్, ఉప్పరిగూడెం, శేరిరాంరెడ్డి గూడెం, బద్రిగూడెం తదితర గ్రామాల ప్రజల అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. పరిశ్రమలో ఉత్పత్తుల తయారికి అవసరమైన కలప, బొగ్గు, వరి పొట్టును విచ్చలవిడిగా వినియోగిస్తుండడంతో కాలుష్యం వ్యాపిస్తున్నదన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

‘ప్రజాపాలన’పై కళా ప్రదర్శన

జిన్నారం, నవంబర్ 27: ఏడాది ప్రజాపాలన ప్రగతిపై తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా కళాకారులు జిన్నారం మండలంలోని పలు గ్రామాల్లో కళాయాత్ర కార్యక్రమాలు బుధవారం నిర్వహించారు. మండల కేంద్రం జిన్నారంతోపాటు వావిలాల, మంగంపేట గ్రామాల్లో ప్రజా విజయోత్సవాల పేరుతో ఆట, మాట, పాట ద్వారా కళాకారులు ప్రభుత్వ పథకాలను వివరించారు. కార్యక్రమంలో కళాకారులు సునిల్, రమేశ్, దుర్గేశ్, మల్లేశ్, సంధ్య, వినేశ్, నవీన్, శంకర్ పాల్గొన్నారు.

కల్హేర్ మండల పరిధిలో..

కల్హేర్, నవంబర్ 27: కలెక్టర్, సమాచార పౌరసంబంధాల శాఖ ఆధ్వర్యంలో ప్రజాపాలన విజయోత్సవాలపై మండల పరిధిలోని కల్హేర్, కృష్ణాపూర్, మాసాన్‌పల్లి గ్రామాల్లో కళా ప్రదర్శన నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి బృందం లీడర్ శేఖర్‌గౌడ్‌తోపాటు ఎనిమిది మంది కళాకారులు పాల్గొన్నారు.

తారాలో ఘనంగా ఎన్‌సీసీ దినోత్సవం

ఎన్‌సీసీ కేడెట్లతో ప్రిన్సిపాల్ రత్నప్రసాద్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: నేషనల్ కెడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) 76వ దినోత్సవ వేడుకలు బుధవారం తారా ప్రభుత్వ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేఎస్ఎస్ రత్నప్రసాద్ మాట్లాడూతూ ఎన్‌సీసీలో చేరితే విద్యార్థులకు టైం మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ, ఆర్మీలో పనిచేసే అవకాశం లభిస్తుందని తెలిపారు. అనంతరం రాష్ట్ర, జాతీయ స్థాయిలో వివిధ అంశాల్లో రాణించిన కెడెట్లకు బ్యాడ్జిలు, బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల కెడెట్‌లు నిర్వహించిన విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ విజయ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మై భారత్ పోర్టల్‌పై అవగాహన

తారా ప్రభుత్వ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మై భారత్ పోర్టల్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రత్యేకంగా 18 నుంచి 29 సంవత్సరాల లోపు యువత ఈ పోర్టల్‌లో సాధించిన విజయాలు నమోదు చేసుకుంటే భవిష్యత్‌లో ప్రభుత్వ పథకాలు, ఉపాధి అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ సదయ్య కుమార్, డాక్టర్ జోత్స్న తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఉపాధ్యాయులతో నిజాంపూర్ పూర్వ విద్యార్థులు

సదాశివపేట, నవంబర్ 27: మండల పరిధిలోని నిజాంపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 1998-95 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు బుధవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న వారంతా ఒకరినొకరు పలకరించుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాణయ్య, ఉపాధ్యాయులు మార్తాండరావు, సోమలింగం, బుచ్చప్ప, మైసొద్దీన్, సంగమణి, కృష్ణ, హరి, అంజాద్ అలీ, విద్యార్థులు ధనుంజయ, పాండు, రవి, వాసవి, ప్రణీత పాల్గొన్నారు.

‘ఈ పంచాయతీ కార్యదర్శి మాకొద్దు’



వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఝరాసంగం, నవంబర్ 27: గ్రామ సమస్యలను పట్టించుకోవడం లేదని తుమ్మన్‌పల్లి, సంఘం(కే) గ్రామాల ప్రజలు ఆరోపించారు. ప్రజలకు అందుబాటులో లేకుండా విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న తుమ్మన్‌పల్లి, సంఘం(కే) గ్రామాల పంచాయతీ కార్యదర్శి జఖిర్ ఖాన్‌ను తొలిగించి కొత్త పంచాయతీ కార్యదర్శిని నియమించాలంటూ గ్రామస్తులు బుధవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఎదుట ఎంపీడీవో సుధాకర్‌కు వినతిపత్రం అందజేశారు. ఎంపీడీవో స్పందిస్తూ ఈ విషయన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు.

అధికారుల సలహాలు పాటించాలి

అల్గోల్‌లో చెరుకు తోటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త విజయ్‌కుమార్, ఏడీఏ భిక్షపతి

జహీరాబాద్/కోహీర్, నవంబర్ 27: చెరుకు సాగు చేసే రైతులు అధిక దిగుబడులు పొందేందుకు అధికారుల సూచనలు, సలహాలను పాటించాలని బసంత్‌పూర్ వ్యవసాయ శాస్త్రవేత్త విజయ్‌కుమార్, ఏడీఏ భిక్షపతి పేర్కొన్నారు. బుధవారం అల్గోల్ గ్రామంలో రైతులు పండిస్తున్న చెరుకు తోటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెరుకు పంట పక్వం దశకు వచ్చే వరకు కోత ప్రారంభించొద్దని సూచించారు. చెరుకులో చక్కెర శాతం పెరిగిన తర్వాతనే నరకాలన్నారు. నేల స్వభావం, ప్రాంతాలను బట్టి చెరుకు విత్తన రకాలను ఎంచుకోవాలని సూచించారు. సరైన విత్తనం ఉంటేనే అధిక దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో లావణ్య, రైతులు పాల్గొన్నారు.

జీవాలకు టీకాలు తప్పనిసరిగా వేయించాలి

టీకా వేస్తున్న వైద్యాధికారి గణేశ్

జహీరాబాద్, కోహీర్, నవంబర్ 27: మేకలు, గొర్రెలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని న్యాల్‌కల్ మండల పశుసంవర్ధక శాఖ అధికారి గణేశ్ రైతులకు సూచించారు. బుధవారం మండలంలోని హద్నూర్, డప్పూర్, ఇబ్రహీంపూర్ గ్రామాల్లో మేకలు, గొర్రెలకు ముసర వ్యాధి నివారణ కోసం పీపీఆర్ టీకా వేశారు. మేకలు, గొర్రెలకు జనవరి, ఫిబ్రవరిలో ముసర వ్యాధి వ్యాపిస్తుందని, మందులు లేవని, టీకా మాత్రమే వేయించాల్సి ఉంటుందన్నారు. మండలంలో టీకాలు వేసేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కిష న్‌రావు, లక్ష్మి, మజీద్, ప్రభావతి, గొర్రెలు, మేకల పెంపకందారులు పాల్గొన్నారు.

ఘనంగా సాలగ్రామ పూజలు

గుమ్మడిదల, నవంబర్ 27: కార్తికమాసాన్ని పురస్కరించుకొని వేంకటేశ్వర స్వామి ఆలయంలో సామూహికంగా సాలగ్రామ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం మండల కేంద్రంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ వంశపారంపర్యకులు కేవీ నరసింహాచార్యులు రంగనారాచార్యులు ఆధ్వర్యంలో సామూహికంగా సాలగ్రామ, కుంకుమార్చన పూజలు నిర్వహించారు.

గురుకులాల్లో అధికారుల తనిఖీలు

కందిలో విద్యార్థులకు వడ్డించే భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ రవీందర్‌రెడ్డి

కంది, నవంబర్ 27: కంది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆర్డీఓ రవీందర్‌రెడ్డి తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి విద్యా బోధన, కనీస సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన డాటా ఎంట్రీని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంపీఓ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గిర్మాపూర్ గురుకులంలో..

కొండాపూర్, నవంబర్ 27: మండల పరిధిలోని గిర్మాపూర్ గురుకుల పాఠశాలను ఎంపీడీవో శ్రీనివాస్, డిప్యూటీ తహసీల్దార్ మర్రి ప్రదీప్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని సూచించారు.

జిన్నారంలో..

జిన్నారం, నవంబర్ 27: జిన్నారం కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఇన్‌చార్జి ఎంఈవో కుమారస్వామి బుధవారం పరిశీలించారు. వంట గదిలో విద్యార్థుల కోసం సిద్ధం చేసిన అన్నం, పప్పు, ఇతర ఆహార పదార్థాలను పరిశీలించారు. వంట గదిలో కలియతిరిగి పర్యవేక్షించారు. వంట గదిలో నిల్వ ఉన్న కూరగాయలను తనిఖీ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

జహీరాబాద్, నవంబర్ 27: మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని ఆర్డీవో రామ్‌రెడ్డి, సంక్షేమాధికారి కృష్ణవంశి అన్నారు. జహీరాబాద్‌లోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహం పరిసరాలు, వంటగదిని, వంట సామగ్రి, గదిని, మరుగుదొడ్లను పరిశీలించారు.

PUBLIC NOTICE

This is to inform the general public that **Karthik,** is the owner of H.No.4-8-88/4, Plot No. 4/Part B, land admeasuring 100 sq.yds., in survey no. 207/1 situated at Manjira Nagar, Kalvakunta, Sangareddy who acquired the same vide Registered sale deed no. 2594/2022 dated 20-7-2022. The Original link documents bearing no. 638/2010, 7368/2010,13502/2008, 15099/ 2007, 5574/ 2007, 30236/2006 are lost.

Whosoever has found the above mentioned original documents and whoever has got any claims or rights over the above mentioned property. Please contact J.Sivanesan, Advocate, Contact No. 9393099915 within 10 days from date of publication of this notice.

ట్రాన్స్‌జెండర్లకు ప్రత్యేక న్యాయ సదస్సు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్

సంగారెడ్డి కలెక్టరేట్, నవంబర్ 27: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు బుధవారం సంగారెడ్డిలోని న్యాయ సేవా సదన్‌లో ట్రాన్స్‌జెండర్లకు న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి రమేశ్ మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్లు అన్ని చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అందరూ క్రమశిక్షణగా ఉండాలని సూచించారు. న్యాయ వ్యవస్థలో ఎలా ఉండాలనే అంశాలపై అవగాహన కల్పించారు. వారికి ఉన్న హక్కులను వివరించారు. విద్య, ఉపాధి, ఆరోగ్య సంరక్షణ, ప్రజలకు అందుబాటులో ఉన్న వస్తువులు, సౌకర్యాలు, అవకాశాలను యాక్సెస్ చేయడం, వాటిని అనుభవించడం, ఉద్యమం, నివాసం, అద్దె లేదా ఆస్తిని ఆక్రమించే హక్కు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలను నిర్వహించే అవకాశం, లింగ మార్పిడి, వ్యక్తి సంరక్షణ, న్యాయ పరమైన విషయాల్లో ఉచిత న్యాయ సహాయం కోరితే న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి లలిత కుమారి, పోలీసు అధికారులు, పారా లీగల్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

బాలికల హక్కులపై అవగాహన

ఝరాసంగం, నవంబర్ 27: బాలికలకు విద్య, న్యాయం, వైద్యం, పోషకాహారం, సంరక్షణ వంటి కనీస హక్కుల గురించి విద్యార్థులకు జిల్లా మహిళా శిశు సంక్షేమాధికారి లలితకుమారి వివరించారు. బుధవారం ఝరాసంగం మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బాల